31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

మంగళవారం,సెప్టెంబర్ 08 ,2026 పేజీలు : 8

## గణేష్ మండపాలకు ఆన్‌లైన్ నమోదు తప్పనిసరి

**• జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 7 :** గణేష్ మండప నిర్వహణకు సంబంధించిన ఆన్‌లైన్ ఇన్ఫర్మేషన్ కేవలం భద్రత, బందోబస్తు కోసమే రూపొందించామని, దీనికి ఎలాంటి రుసుము లేదని ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. గణేష్ నిర్వాహకులు http://policeportal.tspolice.gov.in లింక్ ద్వారా వివరాలు నమోదు చేసి సంబంధిత పోలీస్ స్టేషన్‌లో అందించాలని సూచించారు. రవాణా, అత్యవసర వాహనాలకు ఇబ్బంది లేకుండా మండపాలు ఏర్పాటు చేయాలి. విద్యుత్ శాఖ అనుమతితోనే కనెక్షన్ తీసుకోవాలి. ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు, 24 గంటలు 4గురు వాలంటీర్లు ఉండాలి. ఫైర్ సేఫ్టీ కోసం ఇసుక,నీరు, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ ఏర్పాటు చేయాలి. రాత్రి 10 గంటల వరకే స్పీకర్లు, డీజేలు పూర్తిగా నిషేధం. మండపాల వద్ద మద్యం, జూదం, అసభ్య నృత్యాలు నిషేధం. శోభాయాత్ర సమయంలో రంగులు చల్లడం, టపాసులు పేల్చడం నిషేధం. అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలి. ప్రశాంత వాతావరణంలో నవరాత్రులు జరిగేలా సహకరించాలని ఎస్పీ కోరారు.

## దక్షిణ కాశీకి నవ శోభ.. ధర్మపురి ఉగ్ర నారసింహుడికి మహర్దశ

**• చారిత్రక ప్రాభవం భవిష్యత్ వైభవం : ధర్మపురి ఆలయ పునర్నిర్మాణం**

**రామ కిష్టయ్య సంగన భట్ల**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**



దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచి, పవిత్ర గోదావరి నదీ తీరాన శతాబ్దాల ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లుతున్న ధర్మపురి పుణ్యక్షేత్ర చరిత్రలో మరో అపూర్వ, సువర్ణాక్షర లిఖిత ఘట్టం ఆవిష్కృతమైంది. నవ నరసింహ క్షేత్రాలలో అగ్రగణ్యమై, గోదావరి దక్షిణాభిముఖంగా ప్రవహించే దివ్య తీరంలో వెలసిన శ్రీ ఉగ్ర లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా శ్రీకారం చుట్టింది. కాలగమనంలో శైవ, వైష్ణవ సంప్రదాయాల అపురూప సంగమ వేదికగా, వేద విద్యలకు, ఉన్నత సాహిత్య కళా సంపదలకు పట్టుగొమ్మగా నిలిచిన ఈ ప్రాచీన క్షేత్రానికి పూర్వ వైభవాన్ని సంతరింప జేస్తూనే, భవిష్యత్ తరాల అవసరాలను తీర్చేందుకు సమగ్ర కార్యాచరణ మొదలైంది. పెరుగుతున్న భక్తుల తాకిడికి అనుగుణంగా ఆలయ ప్రాంగణాన్ని విస్తరిస్తూ, ఆధ్యాత్మిక అవసరాలను తీర్చే లక్ష్యంతో ప్రభుత్వం ప్రాథమికంగా రూ.10 కోట్ల నిధులను మంజూరు చేసింది. సోమవారం వేకువ జామున వేదపండితుల మంత్రోచ్చారణలు,మంగళ వాయిద్యాల నడుమ నిర్ణయించిన శుభముహూర్తంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించి ఈ చారిత్రక నిర్మాణ పనులను లాంఛనంగా ప్రారంభించారు.ప్రస్తుతం ధర్మపురిలోని ఉగ్ర నరసింహస్వామి ఆలయం పై కప్పు కొంత దెబ్బ తినడం, పరిమిత విస్తీర్ణంలో ఉండటంతో సాధారణ రోజుల్లోనే కాక, పర్వదినాలు, ఉత్సవాల వేళల్లో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గోదావరి పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారి దర్శనార్థం తరలివచ్చే భక్తుల రద్దీని తట్టుకోవడానికి ప్రస్తుత స్థలం ఏమాత్రం సరిపోవడం లేదు. ఈ సంక్లిష్ట సమస్యను శాశ్వతంగా పరిష్కరించే దిశగా, నేటి అవసరాలకే పరిమితం కాకుండా భావితరాల విశ్వాసాలకు నిలయంగా నిలిచేలా సరికొత్త నిర్మాణ నమూనాను సిద్ధం చేశారు. ప్రసిద్ధ స్తపతుల ప్రత్యక్ష పర్యవేక్షణలో, ఆగమశాస్త్ర నియమ నిబంధనలకు ఏమాత్రం భంగం వాటిల్లకుండా ఈ నిర్మాణ శైలిని ఖరారు చేయడం విశేషం. భక్తి, శిల్పం, శాస్త్రం, భక్తుల సౌకర్యం అనే నాలుగు మూలస్తంభాల సమన్వయంతో కొత్త ఆలయ ప్రాంగణం రూపుదిద్దుకోనుంది. ప్రాచీన శిల్పకళా సౌందర్యం ఉట్టిపడేలా కృష్ణశిలతో నిర్మించనున్న ఈ మహోన్నత ప్రాకారం, ఆలయ ప్రాచీనతను ప్రతిబింబిస్తూనే ఆధునిక సదుపాయాలను భక్తులకు చేరువ చేయనుంది.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించిన వివరాలు తెలంగాణ సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ పట్ల ప్రభుత్వ నిబద్ధతను చాటుతున్నాయి. రాష్ట్రంలోని పురాతన ఆలయాల పరిరక్షణతో పాటు, రాబోయే 2027 గోదావరి మహా పుష్కరాలను అత్యంత వైభవంగా, కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించేందుకు ప్రభుత్వం ఏకంగా రూ.వెయ్యికోట్ల భారీ నిధిని కేటాయించినట్లు ఆయన స్పష్టం చేశారు.బాసర పుణ్యక్షేత్రం మొదలుకొని భద్రాచల రామాలయం వరకు గోదావరి పరివాహక ప్రాంతంలోని అన్ని ప్రముఖ క్షేత్రాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దే బృహత్ ప్రణాళిక రూపుదిద్దుకుంది. ఇందులో భాగంగానే ధర్మపురి, చారిత్రక బౌద్ధ-శైవ కేంద్రమైన కోటిలింగాల క్షేత్రాల సమగ్రాభివృద్ధి కోసం సుమారు రూ.200 కోట్ల వ్యయంతో భారీ అభివృద్ధి పనులను చేపట్టారు. పుష్కర సన్నాహకాల్లో భాగంగా గోదావరి తీరంలో భక్తులు సురక్షితంగా పుణ్యస్నానాలు ఆచరించేందుకు వీలుగా రూ.22.16 కోట్లతో నూతన పుష్కర ఘాట్ల నిర్మాణానికి, ధర్మపురి పరిసర ప్రాంతాల అనుసంధానాన్ని పెంచుతూ రూ.58.55 కోట్లతో తొమ్మిది ప్రధాన రహదారుల విస్తరణ, నిర్మాణ పనులకు శంకుస్థాపనలు జరిగాయి. అలాగే నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసంతిమ్మాపూర్‌లో రూ.2.48 కోట్లతో నూతనవిద్యుత్ ఉపకేంద్రాన్ని

-మిగతా 2లో



## హామీల అమలులో ప్రభుత్వం విఫలం

**• జగిత్యాలలో 100 కోట్ల ప్రభుత్వ ఆస్తి కబ్జా**
**• 10 నెలలుగా చర్యలు లేవు**
**• మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 7 :** హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని,జగిత్యాలలో 100 కోట్ల ప్రభుత్వ ఆస్తి కబ్జా గురైందని, 10 నెలలుగా చర్యలు తీసుకోవడం లేదని మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీల అమలు వైఫల్యాలపై బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమ వారం జగిత్యాల నియోజకవర్గం లోని అన్ని మండలాల్లో నిరసనలు చేపట్టగా జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్‌రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టరేట్ లో ప్రజావాణిలో వినతిపత్రం అందజేసి ధర్నా చేపట్టారు. జగిత్యాల మాజీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దావా వసంత సురేష్, బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు, సర్పంచులు కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.కాంగ్రెస్ హామీల వైఫల్యాలపై నల్లడ్రెస్ వేసుకుని అసెంబ్లీకి వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టును నిరసిస్తూ కలెక్టరేట్ వద్ద బైఠాయించి రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎమ్మెల్యేలను వెంటనే విడుదల చేసి అసెంబ్లీకి అనుమతించాలని డిమాండ్ చేశారు. అనంతరం జీవన్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ ఆలోచన మేరకు, కేటీఆర్ దిశా నిర్దేశంతో ఐదు రోజులుగా

-మిగతా 2లో

### కోటేశ్వరస్వామి

## బాలాలయ జీర్నోద్ధరణ,కలశ ప్రతిష్ట

**• అభివృద్ధి పనులు ప్రారంభించిన రాష్ట్ర మంత్రి అడ్లూరి**



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, సెప్టెంబర్ 07 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కోటిలింగాల గోదావరి పుష్కరాల అభివృద్ధి పనులకు నిధులు మంజూరి కావడంతో శ్రీ కోటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా రెండురోజులుగా జరిగిన ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమం సోమవారం ముగిసింది.శైవ ఆగమ సాంప్రదాయపద్ధతిలోదేవతామూర్తుల కలశ అవరోహణం,హోమము బలిహరణ పూజలు నిర్వహించిన వేదంపండితులు బాలాలయంలో కలశ ప్రతిష్టాపన గావించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాంఘీక సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దేవాదాయ శాఖ ఉమ్మడి కరీంనగర్ జిల్లా సహాయ కమిషనర్ ఎన్ సుప్రియ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజేష్, అధికారులు మండల, గ్రామ ప్రజా ప్రతినిధులు, ఆలయ చైర్మన్ ధర్మకర్తలు పాల్గొన్నారు.2027లో జరుగు గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం 4.5కోట్లతో కోటేశ్వరస్వామి ఆలయ పునః

-మిగతా 2లో

## డిప్యూటీ సీఎంకు స్వాగతం పలికిన జిల్లా ఎస్పీ




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 7 :** ధర్మపురిలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రంలో ఉగ్ర నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు సంబంధించిన భూమిపూజ కార్యక్రమానికి జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఉప ముఖ్యమంత్రికి పూల బొకే అందజేసి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు.

## ఇటిక్యాల్‌లో మాజీమంత్రి ప్రత్యేక పూజలు



**చురకలు విలేకరి, రాయికల్, సెప్టెంబర్ 7 :** రాయికల్ మండలం ఇటిక్యాల్ గ్రామంలో సోమవారం గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టపాన సందర్భంగా గంగమ్మ తల్లిని దర్శించుకొని మాజీ మంత్రి జీవన్ రెడ్డి పూజలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత,యువజన నాయకుడు సి కె రెడ్డి,కొమ్ముల ఆది రెడ్డి,బొడ్గం అంజిరెడ్డి,కంటే విష్ణు, పొట్ట వత్తిని సతీష్, కనపర్తి శ్రీనివాస్, రాజేందర్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

## కోటేశ్వరస్వామి బాలాలయ జీర్ణోద్దరణ,కలశ ప్రతిష్ట



**మొదటి పేజీ తరువాయి...**నిర్మాణం,రాజగోపుర నిర్మాణ పనులను మంత్రి అడ్లూరి ప్రారంభించారు.మంత్రి అడ్లూరికి స్వామివారి శేష వస్త్రం ప్రసాదం, చిత్రపటం అందజేసి ఆశీర్వచనం ఇచ్చారు.ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరి చేసిన మంత్రికి ఆలయ చైర్మన్ రమేష్, కమిటీ సభ్యులు, కార్యనిర్వాహణాధికారి కాంతరెడ్డి ఆలయ అర్చకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నేటి నుండి బాలాలయంలోనే భక్తులకు స్వామివారి దర్శనం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

# వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి : ఎస్పీ



**చురకలు ప్రతినిధి,నిర్మల్, సెప్టెంబర్, 07 :** నిర్మల్ ఐడీఓసీలో వినాయక చవితి, గణేష్ నవరాత్రి ఉత్సవాలు, గణేష్ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా శాంతిభద్రతలు మరియు భద్రతా ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, జిల్లా ఎస్పీ. జానకి షర్మిల ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలు మరియు నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్టమైన పోలీస్ బందోబస్తు, ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని ఎస్పీ తెలిపారు. ప్రతి గణేష్ మండపం వద్ద భద్రతా పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని సూచించారు. నిమజ్జన మరియు ఊరేగింపు మార్గాలను ముందుగానే పరిశీలించి, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలను సిద్ధం చేయాలని తెలిపారు. రద్దీ ప్రాంతాల్లో తగినంత పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ఊరేగింపుల్లో డీజేలు, అధిక శబ్దం, రెచ్చగొట్టే నినాదాలు, మద్యం సేవించి పాల్గొనడం వంటి అంశాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఎస్పీ స్పష్టం చేశారు. రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంచడంతో పాటు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులను ముందుగానే గుర్తించి చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా,సురక్షితంగా నిర్వహించేందుకు ప్రజలు,ఉత్సవ కమిటీలు పోలీస్ శాఖకు పూర్తిస్థాయిలో సహకరించాలని ఎస్పీ కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు,భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్,డిఆర్ఓ రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్,డీఎస్పీ శ్రీనివాస్, శాంతి కమిటీ సభ్యులు,పోలీస్ అధికారులు, సీఐలు,ఎస్ఐలు,ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దక్షిణ కాశీకి నవ శోభ.. ధర్మపురి ఉగ్ర నారసింహుడికి మహర్దశ



**మొదటి పేజీ తరువాయి...** మంజూరు చేశారు. ఇప్పటికే మంజూరైన నిధులకు తోడుగా మరో రూ. 80కోట్లను అదనంగా కేటాయించడంతో ఈ పుణ్యక్షేత్ర రూపురేఖలు సమూలంగా మారనున్నాయి. 2027జూన్ 26 నుంచి జూలై 7వరకు జరగనున్న గోదావరి పుష్కరాలు ఈ సమగ్ర ప్రాజెక్టుకు అత్యంత కీలకమైన గడువుగా మారాయి. పుష్కరాల పన్నెండు రోజుల వ్యవధిలో దేశవిదేశాల నుంచి కోట్లాది మంది భక్తులు గోదావరి తీరానికి తరలివచ్చే అవకాశముంది. ఈ అపార జనసందోహాన్ని నియంత్రించడం తో పాటు,దర్శన క్రమంసాఫీగా సాగేందుకు అంతర్జాతీయ స్థాయి క్యూలైన్ల వ్యవస్థ, వేలాది మందికి తాగునీరు, పారిశుద్ధ్యం, శుభ్రమైన మరుగుదొడ్లు, తాత్కాలిక, శాశ్వత వసతి గృహాలు,రవాణా సౌకర్యాలు,భారీ వాహనాల పార్కింగ్ స్థలాలు, అత్యవసర వైద్య కేంద్రాలు, పటిష్టమైన పోలీసు నిఘా వ్యవస్థలను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాల్సి ఉంది. పుష్కరాల కోసం సృష్టించే ఈ మౌలిక వసతులు కేవలం పన్నెండు రోజులకే పరిమితం కాకుండా, పుష్కరాల అనంతరం కూడా నిరంతరం ధర్మపురికి విచ్చేసే లక్షలాది భక్తులకు చిరకాల ప్రయోజనాన్ని చేకూర్చేలా రూపొందిస్తున్నారు. అయితే, ఈ మహత్తర పునర్నిర్మాణ క్రమం కేవలం భౌతిక సిమెంట్,రాతి నిర్మాణాల సమాహారంగా మాత్రమే మిగిలి పోకూడదన్న విజ్ఞుల వాదనను విస్తృతంగా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది. ధర్మపురి వంటి యుగాల చరిత్ర కలిగిన దివ్యధామంలో పునర్నిర్మాణం అంటే క్షేత్రం యొక్క అస్తిత్వాన్ని, శిల్పవైభవాన్ని కాపాడుతూనే ఆధునికతను జోడించడం. ప్రాచీన ఆలయాల్లో ఉండే రాతి స్తంభాలు,సునిశిత శిల్పకళా రీతులు, ప్రతిష్టిత విగ్రహాలు, గర్భాలయ పవిత్రతలకు ఎలాంటి ఆటంకం కలగకుండా, ఆగమ సంప్రదాయాలను కచ్చితంగా పాటిస్తూ విస్తరణ జరగాలి. ఆధునికత పేరుతో ఆలయపు ఆధ్యాత్మిక ప్రశాంతత, పురాతన ప్రాశస్త్యం మసకబార కూడదు. ఈ మహోన్నత క్రతువులో స్థానికఅర్చకులు, వేదపండితులు,పురాతత్వ శాస్త్రవేత్తలు, చరిత్రకారులు,స్థానిక ప్రజల భాగస్వామ్యం అత్యంత ఆవశ్యకం. స్థానిక శాసనసభ్యులు,మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక చొరవతో ధర్మపురి క్షేత్రానికి ఈ నూతన కళ సమకూరడం నియోజకవర్గ ప్రజల్లో సరికొత్త ఆశలను, ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపింది. ధర్మపురి పుణ్యభూమిని రాష్ట్రంలోనే తలమానికమైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఆయన ప్రకటించారు. భక్తి ఉన్నచోట భగవంతుని అనుగ్రహం, చరిత్ర ఉన్నచోట సజీవ సంస్కృతి భాసిల్లుతాయి. ఈ రెండు సత్యాలను మేళవించి ధర్మపురి ఉగ్ర నరసింహుడి ఆలయాన్ని పునర్నిర్మించడం వల్ల ఇది కేవలం ఒక దేవాలయ విస్తరణగా మాత్రమే కాకుండా,తెలంగాణ ఆధ్యాత్మిక వైభవానికి మకుటాయమానంగా నిలుస్తుంది. పాత వైభవపు పునాదులపై కొత్త శోభను అద్దుతూ, నేటి భక్తులకు సకల సౌకర్యాలను సమకూరుస్తూ, రేపటి తరాలకు మహోన్నత సనాతన వారసత్వాన్ని పదిలంగా అందించే విధంగా ఈ పునర్నిర్మాణ మహాకార్యం దిగ్విజయంగా సాకారమై ఉగ్ర నరసింహుడి కీర్తిని దశదిశలా వ్యాపింప జేయనుంది. దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, విద్యుత్ శాఖ సీఎండి వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్, ఎస్పీ అశోక్, అడిషనల్ కలెక్టర్ రాజాగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు దినేష్, దేవస్థాన ఈఓ శ్రీనివాస్,కరీంనగర్ దేవాదాయ శాఖ ఏసీ సుప్రియ,ధర్మపురి మున్సిపల్ చైర్ పర్సన్ నాగలక్ష్మి, దేవస్థాన మాజీ చైర్మన్ జక్కు రవి,తదితరులు భూమి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

# హామీల అమలులో ప్రభుత్వం విఫలం

**మొదటి పేజీ తరువాయి...** నిరసనలు చేపడుతున్నామని, మహాలక్ష్మి స్కీం కింద 2500,వృద్ధులకు 4000, బీడీ కార్మికులకు పెన్షన్ హామీలు ఏ ఒక్కటీ పూర్తిగా అమలు కాలేదన్నారు. జగిత్యాలలో ప్రభుత్వ ఆస్తుల అక్రమాలపై తీవ్రంగా స్పందిస్తూ తహసీల్ ఆఫీసు వద్ద పెట్రోల్ బంక్ ఏర్పాటుకు ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ సంస్థలుండగా టెండర్ లేకుండా కలెక్టర్ ఏకపక్షంగా ఐఓసీకి సుమారు 100 కోట్ల విలువైన స్థలాన్ని ధారాదత్తం చేశారని ఆరోపించారు. చారిత్రక భవనాన్ని ప్రభుత్వ అనుమతి లేకుండా కూల్చేశారని,నెలకు 25 వేల అద్దె వచ్చే మున్సిపల్ దుకాణాలను 12 వేలకే అప్పగించారన్నారు. పెట్రోల్ బంక్ పేరిట 20 గుంటల మున్సిపల్ ఆస్తి తీసుకుని 4గుంటల్లో బంక్ పెట్టి 16 గుంటలు అన్యాక్రాంతం చేశారని, దీనిపై చర్యలు తీసుకుంటామని చెప్పి 10 నెలలు గడిచినా చర్యల్లేవన్నారు. మళ్లీ కొత్త బస్టాండ్ లో కూడా 100 కోట్ల ఆస్తిని పెట్రోల్ బంక్ పేరిట కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని, పాత బస్టాండ్ వద్ద పోలీసుల ఆధ్వర్యంలోనే బంక్ ఏర్పాటుకు టెండర్లు పిలిచి మూడేళ్లు గడిచినా అనుమతి ఇవ్వకుండా మరోచోట ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. చల్గల్ లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం కలెక్టర్, మంత్రి, ఎమ్మెల్యే ప్రతిపాదించిన స్థలాన్ని పక్కన పెట్టి వివక్ష చూపుతున్నారని, తాటిపల్లి గుట్టల అక్రమ తవ్వకాలు, తిమ్మాపూర్ ముప్పారపు చెరువు కబ్జాపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. ప్రకృతి వనరులను కాపాడాలని, అక్రమ తవ్వకాలు అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. నల్ల డ్రెస్ వేసుకున్నారని ఎమ్మెల్యేలను అరెస్ట్ చేయడం దేశంలో ఎక్కడా లేదని, అసెంబ్లీకి డ్రెస్ కోడ్ ఉందా అని నిలదీశారు. రాహుల్ గాంధీ సైతం నల్లటీషర్ట్‌తో పార్లమెంటుకు వెళ్లారని గుర్తు చేశారు. మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ హామీలు కాగితాలకే పరిమితమయ్యా యని, జాబ్ గ్యారంటీ జాబ్ లెస్ క్యాలెండర్ గా మారిందని, గుట్టలు, సహజ వనరులు కనుమరుగవుతున్నాయని విమర్శించారు. ప్రభుత్వ ఆస్తులు కాపాడాల్సిన కలెక్టరే మరో 100 కోట్ల ఆస్తిని ధారాదత్తం చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండలాల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కోరుట్ల మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు ప్రారంభం



**చురకలు ప్రతినిధి,కోరుట్ల,సెప్టెంబర్ 07 :** కోరుట్ల పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో సోమవారం మండల స్థాయి ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. మున్సిపల్ చైర్మన్ తిరుమల వసంత –గంగాధర్ ఆధ్వర్యంలో పోటీలను ప్రారంభించారు.తొలిరోజు వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు కబడ్డీ పోటీలు నిర్వహించారు.రానున్న రోజుల్లో ఖోఖో, వాలీబాల్ తదితర పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో మండల విద్యాధికారి గంగుల నరేశం,మండల కన్వీనర్ బి.శ్రీనివాస్,ట్రాస్మా అధ్యక్షుడు భారీ,స్థానిక కౌన్సిలర్ వాసిం,ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 5 దరఖాస్తులు



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ (07) :** తెలంగాణ ప్రభుత్వం ప్రజల సమస్యలను స్థానిక స్థాయిలోనే త్వరితగతిన పరిష్కరించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం సోమవారం జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో జరిగింది.ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించిన కార్యక్రమంలో ప్రజల నుంచి మొత్తం 5 దరకాస్తులు స్వీకరించారు.అందులో రెవెన్యూశాఖకు సంబంధించిన 2,డీఆర్‌డీఓ శాఖకు సంబంధించిన 2, పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన 1 వినతి అందినట్లు ఎంపిడిఓ సిహెచ్ గణేష్ తెలిపారు.స్వీకరించిన వినతులను సంబంధిత శాఖలకు పంపించి,వాటిపై వెంటనే చర్యలు తీసుకుని సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీఓ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని,ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రతి అర్జీని సత్వరమే పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో మండల స్థాయి వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం కాలరాస్తోంది



**చురకలు విలేకరి, రాయికల్,సెప్టెంబర్ 7 :** ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం కాలరాస్తోందని బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బర్కం మల్లేష్ కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. సోమవారం అసెంబ్లీ సమావేశాలకు వెళ్తున్నా బి.ఆర్.యస్ పార్టీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను అక్రమంగా అరెస్టు నిరసిస్తూ రాయికల్ మండల,పట్టణ బి.ఆర్.యస్‌పార్టీ ఆధ్వర్యంలో రాయికల్ రాయికల్ ప్రధాన రహదారిపై బైటయించి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారెంటీలు,ఇతర హామీలను నెరవేర్చడం లో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ శ్రేణులు ఆరోపించారు. అనంతరం ప్రజావాణిలో వినతిపత్రం అందించారు.ఈ కార్యక్రమం లో పట్టణ అధ్యక్షులు ఎలిగేటి అనిల్ కుమార్,నాయకులు శ్రీధర్ రెడ్డి, మహేష్ గౌడ్,గుమ్మడి సంతోష్,సుధీర్ రెడ్డ,మహేశ్వర్ రావు,చింతలపెల్లి గంగారెడ్డి, జకిలేటి హరిష్ రావు,కన్నక మహేందర్,రాజేందర్ గౌడ్,రమాపతిరావు,మండ రమేష్,ఎనుగంటి రవి,రాజేశ్వర్ రావు,కోలరాజు,బి.ఆర్.యస్ శ్రేణులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**-జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 7 :** ప్రజావాణి ద్వారా ప్రజల నుండి అందుతున్న ఫిర్యాదులు, వినతులపై సమగ్ర విచారణ జరిపి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు,వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల నుండి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమానికి వస్తున్నారని తెలిపారు. ప్రజల నుండి అందుతున్న ప్రతి ఫిర్యాదును అధికారులు బాధ్యతాయుతం గా తీసుకొని,సంబంధిత సమస్యపై సమగ్ర విచారణ జరిపి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రజావాణి ద్వారా అందిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి,నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం లేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమానికి 62 ఫిర్యాదులు,వినతులు అందాయని, వాటిని సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకొని పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి దరఖాస్తును అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడంతో పాటు దరఖాస్తు దారులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.ఈ కార్యక్రమం లో అడిషనల్ కలెక్టర్లు బిఎస్ లత, అడిషనల్ కలెక్టర్ బి రాజగౌడ్, డిఆర్ఓ కె.వై ప్రసాద్,జిల్లా అధికారులు,వివిధశాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం

**- అసెంబ్లీలో ఎమ్మెల్యేలపై ప్రవర్తనను ఖండించిన బీఆర్ఎస్ నాయకులు**

**- ప్రజావాణిలో వినతిపత్రం సమర్పణ**



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ (07) :** తెలంగాణ శాసనసభలో తమ పార్టీ ఎమ్మెల్యేపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవర్తించిన తీరును ఖండిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో విఫలమైందని ఆరోపిస్తూ సోమవారం బీఆర్ఎస్ మండల నాయకులు జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. అనతరం ఇబ్రహింపట్నం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని అధికారులకు వినతిపత్రం సమర్పించారు. బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, ప్రజాస్వామ్య దేవాలయమైన శాసనసభలో ప్రతిపక్ష ఎమ్మెల్యేల పట్ల గౌరవప్రదంగా వ్యవహరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అయితే ఇటీవల అసెంబ్లీలో తమ పార్టీ ఎమ్మెల్యేలపై అనుచితంగా ప్రవర్తించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. ప్రజల సమస్యలను ప్రస్తావించే ప్రతిపక్ష సభ్యుల గొంతును అణచివేసే ప్రయత్నాలను ప్రభుత్వం మానుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, నిరుద్యోగులు, పేద ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. రాష్ట్ర ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఎన్నికల హామీల అమలుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టం పేరుతో బెదిరింపులు

**-అక్రమ వసూళ్లపై కొరడా ఝుళిపించాలి**

**-ప్రజావాణిలో ఆర్డిఓకు ఫిర్యాదు చేసిన దళిత సంఘాలు**

**చురకలు విలేకరి, మెట్‌పల్లి, సెప్టెంబర్ 7 :** రాజ్యాంగం దళితులు, గిరిజనుల రక్షణ కోసం కల్పించిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టాన్ని కొందరు వ్యక్తిగత ప్రయోజనాలకు, అక్రమ ఒత్తిళ్లకు ఉపయోగించుకుంటూ చట్ట పవిత్రతను దెబ్బతీస్తున్నారని మెట్‌పల్లి దళిత సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. చట్టాన్ని అడ్డం పెట్టుకుని అధికారులను, ప్రజాప్రతినిధులను, సామాన్య ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ అక్రమ లబ్ధి పొందుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు మెట్‌పల్లి ఆర్డీఓకు దళిత సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని కొందరు నాయకులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని తమ స్వార్థ ప్రయోజనాలకు వినియోగించుకుంటూ అధికారులపై, ప్రజలపై ఒత్తిడి తెస్తున్నారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన ఒక గొప్ప రక్షణాత్మక చట్టాన్ని అడ్డదారుల్లో వినియోగించడం ఏమాత్రం సమంజసం కాదని నాయకులు స్పష్టం చేశారు. నిజంగా వివక్షకు, దౌర్జన్యాలకు గురయ్యే ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రక్షణగా ఉండాల్సిన చట్టాన్ని కొందరు తమ అక్రమ సంపాదనలో భాగంగా జేబులు నింపుకునేందుకు ఈ చట్టాన్ని ఆయుధంగా మార్చుకోవడం అత్యంత బాధాకరమని అన్నారు. ఇలాంటి దుర్వినియోగం కారణంగా ప్రజల్లో చట్టాలపై నమ్మకం సన్నగిల్లే ప్రమాదం ఉందని వారు హెచ్చరించారు.



అంతేకాకుండా కొందరు వ్యక్తుల స్వార్థపూరిత చర్యల వల్ల యావత్ దళిత సమాజం ప్రతిష్ఠకు భంగం కలిగే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం అనేది బెదిరింపులకు లేదా వ్యక్తిగత కక్షలు తీర్చుకునేందుకు ఉపయోగించే సాధనం కాదని, సామాజిక వివక్ష, అణచివేతకు గురయ్యే బాధితులకు రక్షణ కల్పించేందుకు రాజ్యాంగం అందించిన శక్తివంతమైన ఆయుధమని పేర్కొన్నారు. చట్టాన్ని నిజమైన బాధితుల రక్షణ కోసం మాత్రమే వినియోగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, తప్పుడు కేసులు, బెదిరింపులు, అక్రమ వసూళ్లకు పాల్పడుతూ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న వారిని గుర్తించి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘ సభ్యులు సోమిడి మహేందర్, బర్ల సూరి, సోమిడి నరేష్, బర్ల అర్జున్, సోమిడి శివ, దాసరి నవీన్, సోమిడి శ్యామ్, తాండ్ర అరవింద్, బడే లక్ష్మణ్, సూరిగిరాల్ శంకర్ పాల్గొన్నారు.

## పదోన్నతి పొందిన ఏఎస్ఐలకు ఎస్పీ శుభాకాంక్షలు



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 7 :** జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో హెడ్ కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తూ ఏఎస్ఐలుగా పదోన్నతి పొందిన మల్లారెడ్డి, మునియ్య, ఎండి.నసీర్ ఖాన్, మహమ్మద్ ఇలియాస్ అహ్మద్ సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ అశోక్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ వారికి ఏఎస్ఐ హోదాకు సంబంధించిన స్టార్ చిహ్నాలను అలంకరించి శుభాకాంక్షలు తెలిపారు. పదోన్నతి అంటే హోదా పెరగడమే కాక బాధ్యతలు కూడా పెరగడమని, క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించి పోలీస్ శాఖపై విశ్వాసం, గౌరవం పెరిగేలా పనిచేయాలని ఎస్పీ సూచించారు.

## కమలాపూర్‌లో ఈత మొక్కల పంపిణీ పంపిణీ



**చురకలు విలేకరి,ధర్మపురి, సెప్టెంబర్ 7 :** ధర్మపురి మండలంలోని కమలాపూర్ గ్రామంలో గౌడసంఘ కాలనీలో గీత కార్మికులకు ఈత మొక్కలను సర్పంచ్ కుమ్మరి తిరుపతి పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దీపిక వార్డ్ మెంబర్లు సట్టం శెట్టి అనిల్ కుమార్ గౌడ సంఘ గీతా కార్మికులు ఉయ్యాల బుచ్చన్న గౌడ్, ఉయ్యాల సత్తయ్య గౌడ్, ఉయ్యాల రవి గౌడ్, పాకాల సాయన్న గౌడ్, పాలకుర్తి కుమార్ గౌడ్, జాబ్‌కార్డ్ ఉన్న మహిళలు పాల్గొన్నారు.

## కెనాల్ గండికి నిధులు మంజూరు చేయాలి



**చురకలు విలేకరి, మెట్ పల్లి రూరల్,సెప్టెంబర్ 7 :** 300 ఎకరాల పంట పొలాలకు సాగునీరు అందించెందుకై చెరువులకు నీరు చేరేలా తెగిపోయిన మాటు కాలువ గండికి నిధులు మంజూరు చేయాలనీ సోమవారం మండలం లోని ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ మహేందర్ కు జగ్గసాగర్ సర్పంచ్ పుల్ల సాయి గౌడ్ వినతిపత్రం అందజేశారు.రంగరావుపేట గుట్టలపై నుంచే వచ్చే నీరు వాగులోకి చేరి దాని ద్వారా జగ్గసాగర్ పెద్దచెరువుకు నీరు చేరుతుందని తెలిపారు.గత నాలుగేండ్ల క్రితం భారీ వర్షాల కారణంగా సూపర్ పాసేజ్ చిన్నగా నిర్మించడం వల్ల ఈ పరిస్థితి వచ్చిందని,ఎల్,నినో ప్రభావం వల్ల వర్షాలు లేక కొంతకాలంగా సాగునీటి సౌకర్యం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిధులు మంజూరు చేయలాని కాలువలు,నీటి వనరుల పరిస్థితిని పరిశీలించి వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు.

# ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును హరించవద్దు

**చురకలు విలేకరి,ధర్మపురి, సెప్టెంబర్ 7 :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ధర్మపురి పర్యటనకు వచ్చిన సందర్భంగా బీజేపీ నాయకులు ప్రశ్నించే అవకాశం ఉందనే ఉద్దేశంతో వెల్గటూర్ వద్ద ముందస్తుగా అరెస్ట్ చేసి,రాత్రి 12గంటల నుంచి ఉదయం వరకు పోలీస్ స్టేషన్లో నిర్బంధించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రజాస్వామ్య దేశంలో ప్రతి పౌరుడికి ఉందని బిజెపి నాయకులు తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీని



నిలబెట్టుకోవడంలో విఫలమైందన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ రాక ఇబ్బందులు పడుతున్నారని వాటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి అభివృద్ధికి వ్యతిరేకం కాదని భక్తులకు ఇబ్బందులు లేకుండా అభివృద్ధి చేయాలని పుష్కరల సమయం లోపు పనులను పూర్తి చేయాలన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్,పట్టణ ప్రధాన కార్యదర్శులు తిరుమందాస్ సత్యనారాయణ, సంగి మాధవ్, సీనియర్ నాయకులు తోట శ్రీనివాస్, ఎండోమెంట్ కన్వీనర్ కలకోట రాజు, బీజేవైఎం నాయకులు మండలోజి సూరజ్, మండల ఉపాధ్యక్షులు ఓగేటి అంజన్న, పట్టణ ఉపాధ్యక్షులు సుంకు మధుసూదన్, కార్యదర్శి ఠాగూర్ రాకేష్, కోశాధికారి సంఘీ రాజేష్, సోమిశెట్టి శివ సాయి, పూదరి పవన్, కాసారపు వెంకటేష్, మామిడిపల్లి రంజిత్, పాత నాగరాజు, సోషల్ మీడియా ఇన్చార్జ్ కా శెట్టి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారంటీలు, 420 హామీలు అమలు చేయాలి ప్రజావాణిలో అర్జీ

### -బిఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టుపై ఎండపల్లి మండల కేంద్రంలో ధర్నా, రాస్తారోకో

**చురకలు విలేకరి ఎండపల్లి సెప్టెంబర్ 07 :** ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలు నెరవేర్చాలని పేర్కొంటూ ఎండపల్లి మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు సోమవారం ప్రజావాణిలో అర్జీ సమర్పించారు. అనంతరం బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీకి రాకుండా ప్రభుత్వం కుట్రపూరితంగా అడ్డుకొని అరెస్టు చేపించడాన్ని నిరసిస్తూ రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశానుసారం ఎండపల్లి మండల



కేంద్రంలోని రాష్ట్ర రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ మహిళా నాయకురాలు, వెల్గటూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ తాజా మాజీ చైర్ పర్సన్ గుండాటి గోపిక- జితేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తుందని వాపోయారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వస్తే హామీల అమలుపై నిలదీస్తారని, అసెంబ్లీకి హాజరు కాకుండా ప్రభుత్వం కుట్రపూరితంగా అడ్డుకుందని ఆరోపించారు. అసెంబ్లీలో బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేల ప్రశ్నలకు తట్టుకోలేక ఈ విధంగా అడ్డుకున్నారని, మహిళ ఎమ్మెల్యే లని చూడకుండా సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డి ల పై పోలీసుల దాడిని ఖండిస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ నాయకులు సింహాచలం జగన్, మారం జలంధర్ రెడ్డి, అల్లే వెంకటేష్ యాదవ్, పడిదం నారాయణ, గాజుల మల్లేశం, మెతుకు స్వామి, జల్లెల్ల కనకయ్య యాదవ్, ఉప్పు రాజయ్య, పొన్నం తిరుపతి గౌడ్, చొప్పదండి బుచ్చి లింగం, చింతల తిరుపతి, గంగాధరి రాజేశం, తనుగుల జగతి గౌడ్, మైలారపు సతీష్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు

## అర్ధరాత్రి అరెస్టులను ఖండించిన బిజెపి



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, సెప్టెంబర్ 07 :** ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ధర్మపురి పర్యటన సందర్భంగా నియోజకవర్గ,మండల బిజెపి నాయకులను అర్ధరాత్రి పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలిం చడాన్ని వెల్గటూర్ మండల బిజెపి తీవ్రంగా ఖండించింది. అర్ధరాత్రి నుండి ఉదయం వరకు నిర్బంధించడం అప్రజాస్వామిక మన్నారు.ప్రశ్నించే గొంతులను అరెస్టులతో అణచి వేయాల ని కాంగ్రెస్ ప్రభుత్వం బావించడం సిగ్గు చేటని,ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసనను తెలియజేసే హక్కు ప్రతిపక్షాలకు ఉందని ఈ పరిస్థితిలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్ళి వస్తుండగా నాయ కులను అకారణంగా అరెస్ట్ చేయడం విచారకరమని వెల్గటూర్ మండల బిజెపి అధ్యక్షులు గోపతి జనార్ధన్ పేర్కొన్నారు.అరెస్ట్ అయిన వారిలో బిజెపిపట్టణ,మండల అధ్యక్షులు గాజు భాస్కర్,కుమ్మరి తిరుపతి,జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్,పట్టణ ప్రధాన కార్యదర్శులు తిరుమందాస్ సత్యనారా యణ,సంఘీ మాధవ్, బీజేవైఎం నాయకులు మండలోజు సూరజ్, కాసరపు వెంకటేష్,సోషల్ మీడియా ఇన్ఛార్జి కాశెట్టి హరీష్ లు ఉన్నారు.

## పీసీ సేవలకు అంతర్జాతీయ గుర్తింపు




### -కానిస్టేబుల్‌విజయ్‌కుమార్ కు అంబేద్కర్ ఇంటర్నేషనల్ అవార్డు

**చురకలు విలేకరి,జగిత్యాల, సెప్టెంబరు, 07 :** సామాజిక సేవలో విశేషంగా కృషి చేస్తున్న జగిత్యాల టౌన్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ నల్లాల విజయ్‌కుమార్‌కు అంతర్జాతీయ గుర్తింపు లభించింది.అమెరికాకుచెందిన లూసియానా రీసెర్చ్ యూనివర్సిటీ 2026 సంవత్సరానికి సామాజిక సేవా విభాగంలో అందించే అంబేద్కర్ ఇంటర్నేషనల్ అవార్డుకు ఆయన ఎంపికయ్యారు.పుణేలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రతినిధులు విజయ్ కుమార్‌ను మెమెంటో, మెడల్, షీల్డుతో సత్కరించారు.నిరుపేద యువతకు కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం సొంత ఖర్చుతో కోచింగ్ ఇప్పించి నలుగురికి ఉద్యోగాలు సాధించడంలో సహకరించారు.విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్లు పంపిణీ చేయడంతోపాటు యువతను వ్యసనాల నుంచి దూరంగా ఉంచేందుకు క్రీడల వైపు మళ్లించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం,రహదారుల మరమ్మతులు,మూఢనమ్మకాల నిర్మూలన,విద్యపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. విజయ్‌కుమార్‌ను టౌన్ సీఐ కరుణాకర్,పోలీస్ సిబ్బంది, పట్టణ ప్రజలు అభినందించారు.

# బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను అక్రమ అరెస్టుకు నిరసనగా ధర్నా

**-ప్రజావాణిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు,420 హామీలను అమలు చేయాలని ఫిర్యాదు**



**చురకలు విలేఖరి వీణవంక సెప్టెంబర్ 07 :** అసెంబ్లీ ముందు బి ఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను పోలీసులు అక్రమ అరెస్టుకు నిరసనగా బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం వీణవంక మండల కేంద్రంలో జమ్మికుంట, కరీంనగర్ రహదారిపై ధర్నా నిర్వహించారు.అలాగే మండల కేంద్రం లోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయాలని బిఆర్ఎస్ పార్టీ అధికారులకు ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అసెంబ్లీకి వెళ్తున్న ఎమ్మెల్యేలను అరెస్ట్ చేయడం సిగ్గుచేట్టు అన్నారు.ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా ఉందని విమర్శించారు.ఈ ప్రాంత ప్రజలకు,రైతులకు ముఖ్యమైన కల్వల ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అసెంబ్లీలో అనేకసార్లు ప్రస్తావించారని,కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని ఎద్దేవ చేశారు.ఇకనైనా ఈ ప్రాంత ప్రజలకు రైతులకు ఉపయోగపడే కల్వల ప్రాజెక్ట్ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు.ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డి కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముసిపట్ల రేణుక తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ రాయిశెటి లత,జడ్పీటీసీ వనమాల సాధవరెడ్డి, సర్పంచులు దాసారపు సరోజన, మ్యడగోని తిరుపతి గౌడ్,జడల రమేష్, ఉప సర్పంచ్ మహేష్ గౌడ్,సిద్ధపల్లి మహిపాల్ రెడ్డి,డైరెక్టర్లు మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,కామీడీ శ్రీనివాస్ రెడ్డి, అడిగొప్పుల సత్యనారాయణ,మర్రి స్వామి,నల్ల తిరుపతిరెడ్డి,తిప్పని ప్రశాంత్ గౌడ్, కాసర్ల సుధాకర్,కర్ణకంటి భాస్కర్ రెడ్డి, ఈదునూరి భూమయ్య, దాసారపు శ్రీనివాస్,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డు అందుకున్న అశోక్



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ సెప్టెంబర్ 7 :** గోదావరిఖనికి చెందిన ప్రముఖ కళాకారులు , సినీ మరియు యూట్యూబ్ రంగంలో తనదైన గుర్తింపు తెచ్చుకున్న అమేజింగ్ స్టార్ అశోక్ వేముల, శ్రీలత నేతలకు ప్రతిష్ఠాత్మకమైన నేతన్న టీవీ కొండా లక్ష్మణ్ బాపూజీ మణిరత్నం పురస్కారం లభించింది. హన్మకొండలోని ఎస్.వి.ఎస్. కన్వెన్షన్ హాలులో ఆదివారం నిర్వహించిన 2026--27 నేతన్న టీవీ--స్వరాజ్ న్యూస్ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో అశోక్ వేముల, శ్రీలత నేతలను ఘనంగా సత్కరించి ఈ పురస్కారాలను అందజేశారు.కళా, సినీ, యూట్యూబ్ మరియు రాజకీయ రంగాల్లో సేవలందించడంతో పాటు సామాజిక చైతన్యానికి తమవంతు కృషి చేస్తున్నందుకు వీరిని పురస్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమం నేతన్న టీవీ, స్వరాజ్ న్యూస్ సంయుక్త ఆధ్వర్యంలో, పద్మశాలి సమాజానికి చెందిన ప్రముఖుల సమక్షంలో ఘనంగా జరిగింది. కార్యక్రమంలో  గుండు సుధారాణి కూడా చైర్మన్, అఖిలభారత పద్మశాలి సంఘం అధ్యక్షులు కందగట్ల స్వామి, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షులు కామార్తపు మురళి, తెలంగాణ రాష్ట్ర మహిళా పద్మశాలి సంఘం అధ్యక్షురాలు గుంటక రూప, నేతన్న టీవీ సీఈఓ పులికంటి రాజేందర్, సినీ గేయ రచయిత, గాయకుడు గుండేటి మురళి, అవయవదాన కార్యక్రమాల నిర్వాహకులు భీష్మాచారి సదాశివ ఫౌండేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి హాజరైన పద్మశాలి సంఘాల ప్రముఖుల సమక్షంలో ఈ అవార్డుల ప్రధానోత్సవం నిర్వహించడం విశేషం.ఈ సందర్భంగా అమేజింగ్ స్టార్ అశోక్ వేముల, శ్రీలత నేత మాట్లాడుతూ, తమ సేవలను గుర్తించి కొండా లక్ష్మణ్ బాపూజీ మణిరత్నం పురస్కారంతో సత్కరించడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందని తెలిపారు. తమను పురస్కారానికి ఎంపిక చేసిన నేతన్న టీవీ, స్వరాజ్ న్యూస్ నిర్వాహకులకు, అవార్డు కమిటీ సభ్యులకు మరియు పద్మశాలి సమాజ పెద్దలకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఎల్లారెడ్డిపేటలో బీఆర్ఎస్ శ్రేణుల ధర్నా



**-కేటీఆర్, హరీశ్‌రావులను అడ్డుకోవడాన్ని నిరసిస్తూ ఆందోళన**

**-పోలీసు బందోబస్తు**

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 07 :** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళనకు దిగారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్), మాజీ మంత్రి హరీశ్‌రావులను పోలీసులు అడ్డుకోవడాన్ని, వారిపై దాడి చేశారంటూ వచ్చిన ఆరోపణలను నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మండల కేంద్రంలో భారీ ధర్నా చేపట్టారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి, తిమ్మాపూర్ సర్పంచ్ అందె సుభాష్, మాజీ జెడ్పీటీసీ చీటీ లక్ష్మణరావు, మహిళా అధ్యక్షురాలు అప్సర ఉన్నిసా, ఎల్లారెడ్డిపేట సర్పంచ్ ఎలగందుల నరసింహులు తో పాటు పలువురు బి ఆర్ ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వీర్నపల్లి పోలీస్ స్టేషన్‌లో డిజె నిర్వాహకులను బైండోవర్



**చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డి పేట ప్రతినిధి 07 :**

రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా డి జె నిర్వాహకులను పోలీసులు సోమవారం బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై లక్ష్మణ్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా అధిక శబ్దంతో డి జె లు నిర్వహించడం, ప్రజలకు ఇబ్బంది కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

## బుగ్గ రాజేశ్వర తండాలో ఫీవర్ సర్వే మెడికల్ క్యాంపులు



**చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డి పేట సెప్టెంబర్ 07 :** ఎల్లారెడ్డిపేట మండలం గుండారం గ్రామంలోని  పోచమ్మతండ, రాజన్నపేటలోని కిష్టనాయక్ తండ, అల్మాస్పూర్లోని బుగ్గరాజేశ్వర తండాలో సోమవారం ఫీవర్ సర్వేమెడికల్ క్యాంపులు నిర్వహించామని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సరియా అంజమ్ తెలిపారు .ఇందులో పోచమ్మ తండాలో 36,కిస్టనాయక్ తండాలో 28, బుగ్గరాజేశ్వర తండాలో26 మందికి డెంగ్యూ మలేరియా టెస్టు నిర్వహించి, తగినమందులు ఇవ్వడం జరిగిందన్నారు.అందరికి పరిసరాల పరిశుభ్రత పాటించాలి అని సూచించారు.ఇందులో భాగంగా ఎం.ఎల్.హెచ్.పి లక్ష్మి  ప్రసన్న,ఏఎన్ఎంలు రాజేశ్వరి,సుమలత,రూతమ్మ,సువర్ణ మరియు ఆశలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు దుస్తుల పంపిణీ



**చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 07 :** ఎల్లారెడ్డిపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ ఎనుగందుల నరసింహులు చే విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఎనుగందుల నరసింహులు మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని అన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు గ్రామపంచాయతీ తరఫున ఎల్లప్పుడూ ముందుంటామని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు.విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ ప్రతిభ కనబరచాలని, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని సర్పంచ్ సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## జీ రాంజీలో అభివృద్ధి పనులు చేపట్టండి



**చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 07 :** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణపూర్ జిరాంజి గ్రామసభలో సోమవారం మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ జిరాంజీ పథకంలోని అభివృద్ధి పనులను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకంలో తరగతి గదులు.మహిళా సంఘాల భవనాలు.సిసి రోడ్లు,మురికి కాలువల నిర్మాణాలకు తీర్మానాలు చేసుకోవాలని సర్పంచులకు సూచించారు.అంతేకాకుండా రైతులకు ఉపయోగపడే షెడ్ల నిర్మాణం భూమి చదును కార్యక్రమం కూలీల చేత పనిచేయించుకోవాలని అన్నారు.ఈ సమావేశంలో జిరాంజి టిఏ నవత పంచాయతీ కార్యదర్శి ఉషశ్రీ ఉపసర్పంచ్ మధుసూదన్ రెడ్డి వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## వీర్నపల్లి పోలీస్ స్టేషన్‌లో డి జె నిర్వాహకులను బైండోవర్



**చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డి పేట ప్రతినిధి 07 :** రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా డి జె నిర్వాహకులను పోలీసులు సోమవారం బైండోవర్ చేశారు.ఈ సందర్భంగా ఎస్సై లక్ష్మణ్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా అధిక శబ్దంతో డిజెలు నిర్వహించడం,ప్రజలకు ఇబ్బంది కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

## ఆలయ కమిటీ చైర్మన్‌గా బర్ల శ్రీనివాస్



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ సెప్టెంబర్ 7 :** రామగిరి మండలం లద్నాపూర్ గ్రామంలోని స్వయంభుగా వెలసిన ఎంతో ప్రసిద్ధి చెందిన శ్రీ గోదా రంగనాయక మరియు దాసాంజనేయ స్వామి ఆలయ చైర్మన్‌గా బర్ల శ్రీనివాస్ ని ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు ఎన్నుకోవడం జరిగింది.తనపై నమ్మకంతో తనకి అవకాశం ఇచ్చిన ఆలయ కమిటీ వారికి లద్నాపూర్ గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆలయ అభివృద్ధికి ఆలయ సౌకర్యాలను దేవాలయం లోని ప్రతి సంవత్సరం జరిగే ఉత్సవాలను నూతన కమిటీ సభ్యులతో గ్రామస్తులతో ఘనంగా నిర్వహిస్తామని ఈ రెండు మూడు రోజుల్లో పూర్తిస్థాయి మిగతా కమిటీని ఎన్నుకోవడం జరుగుతుంది అని తెలియజేశారు.

## హెచ్ఐవిపై అవగాహన



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ గోదావరిఖని సెప్టెంబర్ 7 :** ఆస్పత్రిలో ఐ సి టి సి శంకర్ హెచ్ఐవి పై అవగాహన కల్పించారు.తెలంగాణ ఎయిడ్స కంట్రోల్ సొసైటీ ఆదేశాల అనుసారం ఐ ఈ సి క్యాంపెన్లో భాగంగా స్థానిక వాసవ్య ఉన్నత పాఠశాలలో హెచ్ఐవి ఎయిడ్స్ పై మరియు ఎస్ టి ఐ ఆర్ టి ఐ హెపటైటిస్ బి మీద అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఐసిటిసి కౌన్సిలర్ కట్కూరి శంకర్ మాట్లాడుతూ హెచ్ఐవి ఎయిడ్స్ ఏ విధంగా వ్యాప్తి చెందుతుందో దానిని ఏ విధంగా నివారించాలో వివరిస్తూ సిఫిలిస్ హెపటైటిస్ బి పై కూడా అవగాహన కల్పిస్తూ క్యూఆర్ కోడ్ గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులతో పాటు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు కూడా పాల్గొనడం జరిగింది.

# శ్రీధర్ బాబును విమర్శిస్తే సహించేది లేదు

**-అభివృద్ధి సహించలేకే అసత్య ఆరోపణ**
**-బిఆర్ఎస్ హయాంలో అభివృద్ధి శూన్యం**
**-జిల్లా అధికార ప్రతినిధి సెగ్గం రాజేష్**




**చురకలు ప్రతినిధి,మంథని, సెప్టెంబర్ 7 :** నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని సహించలేకనే మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని జిల్లా అధికార ప్రతినిధి సెగ్గం రాజేష్ మండిపడ్డారు. మంత్రి శ్రీధర్ బాబును విమర్శిస్తే కాంగ్రెస్ కార్యకర్తలు సహించేది లేదని హెచ్చరించారు.సోమవారం మంథనిలో ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంథని నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. రోడ్ల విస్తరణ, కాళేశ్వరం ఆలయ అభివృద్ధి, విద్య, వైద్య రంగాల్లో మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని అన్నారు.అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు.గత పదిసంవత్సరాల బిఆర్ఎస్ ప్రభుత్వంలో మంథని నియోజకవర్గం అభివృద్ధి శూన్యమని విమర్శించారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అన్ని నెరవేరుస్తున్నామని స్పష్టం చేశారు. యువతకు ఉద్యోగాలు,విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని అన్నారు. మంథని నియోజకవర్గంలో నిరుద్యోగులకు ప్రత్యేక ఉచిత శిక్షణ ఇస్తూ అనేక మంది విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించామని ప్రస్తుతం హైదరాబాదులో నియోజవర్గం నుండి 100 మందికి సాఫ్ట్వేర్ ఉద్యోగాలు కల్పించిన ఘనత మంత్రి శ్రీధర్ బాబు దేనని అన్నారు.శ్రీధర్‌బాబు తండ్రి గొప్పవాడు కాబట్టే ఆయన తండ్రి పేరు చెప్పుకొని ఆయన ఆశయాలు సాధించేందుకే కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.ప్రతిపక్షంలో ఉన్న నాయకులు హుందాగా విమర్శించాలని, ప్రజా సమస్యలపై ప్రశ్నించాలే తప్ప వ్యక్తిగతంగా దూషిస్తే మాత్రం సహించేది లేదన్నారు.మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ తన హయాంలో మంథనికి ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు.మంథని నియోజకవర్గం ప్రజలు ఎమ్మెల్యేగా ఐదు సంవత్సరాలు, జడ్పీ చైర్మన్ గా ఐదు సంవత్సరాలు అవకాశం ఇస్తే పదేళ్లు అధికారంలో ఉండి అభివృద్ధి చేయడం చేతకాక వేల కోట్లరూపాయలతో మంతిని నియోజక వర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళుతున్న మా నాయకుడిని విమర్శించడం సిగ్గుచేటు అన్నారు. నాడు మంథనిని అభివృద్ధి చేయ లేదని,ఇప్పుడు అభివృద్ధి జరుగుతుంటే చూసి ఓర్వలేక పోతున్నారని ఎద్దేవా చేశారు.మంథని ప్రజలు మంత్రి శ్రీధర్ బాబు వెంటే ఉన్నారని, అసత్య ఆరోపణలు చేస్తే ప్రజలే బుద్ధి చెబుతారని సెగ్గం రాజేష్ అన్నారు.ఈ విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ ముసుకుల సహేందర్ రెడ్డి,ఐఎన్టియూసి జాతీయ కార్యదర్శి పేరవేన లింగయ్య యాదవ్, కౌన్సిలర్ ఎల్లంకి వంశీ,కాంగ్రెస్ నాయకులు లైశెట్టి రాజు,ఇందారపు అనిల్,అక్కపాక సంపత్,మంథని శ్రీనివాస్,పంచిక దేవేందర్‌లు పాల్గొన్నారు.

# శివ పరాశక్తి పీఠంలో వైభవంగా శ్రావణ చివరి సోమవారం

**-ఏకాదశి ప్రత్యేక పూజలు పంచామృతాభిషేకాలు**



**చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 07 :** పవిత్ర శ్రావణ మాస చివరి సోమవారం, విశిష్టమైన ఏకాదశి తిథి సమలంబనంతో శ్రీ శివ పరాశక్తి పీఠం భక్తిపారవశ్యంతో మార్మోగింది. ఈ పరమపావనమైన రోజున పీఠంలో పరమశివునికి అత్యంత వైభవంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు, విశేష పూజలు నిర్వహించారు.దివ్య అభిషేకాలు-సప్త హారతులమహోత్సవం పంచామృతాభిషేకం: స్వామివారికి పంచామృతాలు, శ్రేష్ఠమైన శ్రీగంధం, పవిత్ర భస్మంతో నేత్రపర్వంగా మహా అభిషేకాలు జరిపించారు. అభిషేకానంతరం స్వామివారిని దివ్యాభరణాలతో ,సుగంధ పుష్పాలతో అలంకరించి, అత్యంత భక్తిశ్రద్ధల నడుమ శాస్త్రోక్తంగా 'సప్త హారతులు' సమర్పించారు.వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి శివయ్య కృపకు పాత్రులయ్యారు. భక్తులందరూ భక్తిప్రపత్తులతో స్వామివారికి అభిషేకాలు నిర్వహించి తారక మంత్రాన్ని స్మరించుకున్నారు.ఈ సందర్భంగా పీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ మనోహర్ రాజు గురూజీగారు భక్తులకు దివ్య ఆశీర్వచనాలు అందించారు. శ్రావణ సోమవారం, ఏకాదశి కలసి వచ్చిన ఈ పవిత్ర దినాన శివారాధన చేయడం వల్ల సకల కల్మషాలు తొలగి, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు లభిస్తాయని గురూజీ పేర్కొన్నారు.మహాపూజ హారతి అనంతరం పీఠం ఆవరణలో వివిద ప్రాంతాల నుండి వచ్చిన భక్తులందరికీ తీర్థప్రసాదాలు అన్నప్రసాద వితరణ చేశారు.

# అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తాం

**-ఎస్ ఎస్ అన్వర్**



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ / సెప్టెంబర్ 7 :** తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు కమాన్ పూర్ మండలం గొల్లపల్లి గ్రామంలో నిర్మించిన నూతన ఇందిరమ్మ ఇళ్లను సోమవారం ఘనంగా ప్రారంభించారు. గ్రామానికి చెందిన లబ్ధిదారులు అరకంటి సౌందర్య- అంజి కు మంజూరైన ఈ ఇళ్లను కమాన్ పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్ ఎస్ అన్వర్ లబ్ధిదారుల కుటుంబ సభ్యులతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.అనంతరం లబ్ధిదారులను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యంలో పేద ప్రజల సొంతింటి కలలు సాకారమవుతున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికీ విడతలవారీగా ఇందిరమ్మ ఇళ్లను అందజేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో గొల్లపల్లి సర్పంచ్ శిలారం మల్లయ్య , కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ శేవ్వా శంకరయ్య, మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మల్యాల మహేష్ గౌడ్, చాట్ల గట్టయ్య,ఉప సర్పంచ్లు ఒడ్నాల శ్రీనివాస్, కొత్తపల్లి సతీష్ గడ్డం రాజా మహేందర్, చొప్పరి శేఖర్ , మహమ్మద్ రఫీక్ సోహెల్,ముత్యం శ్యాంసుందర్ , అంబీర్ రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

# దళిత స్పీకర్‌పై దుర్భాషలు.. ప్రజాస్వామ్యంపై దాడి..

**-తాతా మధు ఎమ్మెల్సీ సభ్యత్వం వెంటనే రద్దు చేయాలి**
**-కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు**



**కరీంనగర్,సెప్టెంబర్ 7 :** దళితుడైన తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కించపరిచేలా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు దుర్భాషలాడడం అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు పేర్కొన్నారు. ఎమ్మెల్సీ అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. సోమవారం మీడియాతో రాజేందర్ రావు మాట్లాడుతూ..స్పీకర్‌ను ఏకవచనంతో సంబోధిస్తూ, 'ఎవడ్రా వాడు' అంటూ అవమానకరంగా మాట్లాడటం తాతామధు అహంకారానికి పరాకాష్ట అని మండిపడ్డారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌ను అవమానించడం ఒక వ్యక్తిని కించపరచడం మాత్రమే కాదని, దళిత సమాజాన్ని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని రాజేందర్‌రావు అన్నారు. శాసనసభ స్పీకర్ పదవికి ఉన్న గౌరవాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు.దళిత స్పీకర్‌పై కులపరమైన దూషణలకు పాల్పడిన తాతా మధుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద వెంటనే కేసు నమోదు చేయాలని రాజేందర్‌రావు డిమాండ్ చేశారు. దీంతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేసి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.తాతా మధు ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని తక్షణమే రద్దు చేసే దిశగా శాసనమండలి చైర్మన్ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇలాంటి భాషను మరోసారి ఎవరూ ఉపయోగించకుండా కఠినమైన శిక్షలు విధించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు.ప్రజాప్రతినిధులు విధానాలను విమర్శించవచ్చని, ప్రభుత్వాన్ని ప్రశ్నించవచ్చని, కానీ రాజ్యాంగ పదవుల్లో ఉన్న వ్యక్తులను వ్యక్తిగతంగా దూషించడం, అవమానించడం ప్రజాస్వామ్యంలో ఎంతమాత్రం సమర్థనీయం కాదని స్పష్టం చేశారు.ఒక దళిత నేతకు జరిగిన అవమానంగా మాత్రమే ఈ ఘటనను చూడకూడదని.. ఇది ప్రజాస్వామ్యానికి జరిగిన అన్యాయంగా ప్రతి ఒక్కరూ గుర్తించాలని రాజేందర్‌రావు అన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చట్టసభలు, ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాత మధు జీవితకాలం చట్టసభలకు పోటీ చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని రాజేంద్ర రావు కోరారు.

# తల్లిదండ్రులను ఇంట్లోంచి గెంటేసిన కొడుకులు



**చురకలు విలేకరి, జగిత్యాల, సెప్టెంబర్ 7 :** జగిత్యాల జిల్లా లోని మల్యాల మండలం సర్వాపూర్ గ్రామానికి చెందిన రామంచ సాయబు భూమయ్య( 87), మల్లవ్వ (85)అనే వృద్ధ తల్లి దండ్రులను అనారోగ్యాలతో భాదలు పడుతున్నప్పటికీ పోషించక వేధింపులకు గురిచేస్తు ఇంట్లోంచి వెళ్ళ గొట్టిన కనికరం లేని కొడుకులపై తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది హరి అశోక్ కుమార్ సాయంతో జగిత్యాల ఆర్డీవో కు ఫిర్యాదు చేయగా కొడుకులపై వృద్ధ తల్లి దండ్రుల సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేశారు. అనంతరం ఆ వృద్ధ తల్లి దండ్రులు సీనియర్ సిటిజెన్స్ కా ర్యాలయంలో విలేకరులకు తమ గోడును ఏడుస్తు వినిపించారు. మా ఇద్దరు కొడుకులకు ఎకరం భూమి ఇచ్చామని, మేము కట్టు కున్న పాత ఇల్లు కూల్చి వేసి ఇద్దరు చెరో ఇల్లు కట్టుకున్నారని వారి ఇండ్లలో ఉంచుకోక పోషించక మమ్మల్ని వెళ్లగొట్టితే అదే గ్రామంలో ఉన్న చర్చిలో దుర్భర పరిస్థితుల్లో ఉంటూ బతుకుతున్నా మని కన్న తల్లిదండ్రులమైన మాకు ఓ రెండు గదుల చిన్న ఇల్లు కట్టించి,మాకు పోషణ,వైద్య ఖర్చు ల కింద ప్రతి నెల రూ.20 వేలు ఇద్దరు కొడుకుల నుంచి ఇప్పించాలని,ఇల్లు కట్టించే వరకు మాకు నివాస వసతి కల్పించాలని వారు ఆర్డీఓను కోరామన్నారు.ఈ రోజు మాకు భోజనం,వసతి సౌకర్యాలు కల్పించి సాయం చేసిన సీనియర్ సిటిజన్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన సాయం తో జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. వారి వెంట సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్,వృద్ధుల సంరక్షణ కాన్సిలియేషన్ అధికారులు పి. సి.హన్మంత్ రెడ్డి, వి. ప్రకాష్ రావు, ప్రభుత్వం కమిటీ సభ్యులు కండ్ల గంగాధర్, పబ్బా శివానందం లు ఉన్నారు.

# వేయి లింగాల ఆలయంలో ఏకాదశి ప్రత్యేక పూజలు

**-శివుడికి పంచామృతాభిషేకాలు**
**-భక్తులతో పోటెత్తిన పొలాస క్షేత్రం**



**చురకలు విలేకరి, జగిత్యాల, సెప్టెంబర్ 7 :** శ్రావణమాసం అంటేనే శివమయం. ద్వాదశ మాసాల్లో పరమశివుడికి అత్యంత ప్రీతికరమైన మాసం శ్రావణం. ఈ మాసంలో స్వామివారికి చేసే ఒక్క బిల్వార్చన కోటి జన్మల పుణ్యఫలాన్ని ఇస్తుందని శాస్త్ర వచనం. శ్రావణ సోమవార వ్రతం, ఏకాదశి ఉపవాసం ఆచరిస్తే సకల దోషాలు తొలగి,ఐశ్వర్యం, ఆయురారోగ్యాలు,సంతాన సౌభాగ్యాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.అందుకే ఈ మాసమంతా శివాలయాలు 'హరహర మహాదేవ' నినాదాలతో మారుమోగుతాయి.

**పంచామృతాభిషేకాలతో పులకించిన భక్తులు... శివుడికి పండ్ల పూజ వైభవం**

జగిత్యాల రూరల్ మండలంలోని పొలాసలోని ప్రసిద్ధ వేయి లింగాల ఆలయంలో శ్రావణ ఏకాదశి వేడుకలు కన్నుల పండుగగా జరిగాయి. శ్రావణమాస ఆఖరి సోమవారం కూడా కావడంతో ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలి వచ్చారు.సహస్ర లింగాల ఆలయంలో శివుడికి భక్తులు అభిషేకాలు చేసి భక్తిని చాటుకున్నారు. వేకువజామునే ఆలయ అర్చకులు స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులు పాలు, పెరుగు, తేనె,నెయ్యి,చక్కెరతో పంచామృతా భిషేకాలు చేశారు.వివిధ రకాల పండ్లతో ప్రత్యేక పండ్ల పూజ ఘనంగా నిర్వహించారు.గోత్రనామాలతో అర్చనలు చేయించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి, మంగళ హారతి సమర్పించి, ఆశీర్వదించారు. శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం,భక్తిభావం వెల్లివిరిసింది. సహస్ర లింగాల ఆలయ ఫౌండర్ చైర్మన్ నలమాస గంగాధర్ ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి.

## విద్యార్థులకు యూనిఫారాలు షూ పంపిణీ




**చురకలు ప్రతినిధి హుజురాబాద్ సెప్టెంబర్ 7 :** శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో సోమవారం విద్యార్థులకు యూనిఫారాలు, షూ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాడ సుజాత రాజిరెడ్డి మాట్లాడుతూ..విద్యార్థులు కష్టపడి ఇష్టంతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకొని కొత్తగట్టు గ్రామానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు తామంతా కట్టుబడి ఉన్నామని తెలిపారు. పాఠశాలలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు గ్రామస్తులు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు ఉన్నారని వారి సేవలను వినియోగించుకోవాలని అన్నారు. కొత్తగట్టు జిల్లా పరిషత్ పాఠశాలకు ఎంతో చరిత్ర ఉందని, ఎంతోమంది ఇక్కడ చదువుకున్న విద్యార్థులు ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని గుర్తు చేశారు. కార్యక్రమంలో స్వచ్ఛంద కార్యకర్త పూదరి నరేష్ తో పాటు గ్రామస్తులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ తాతా మధు దిష్టిబొమ్మ దహనం



**చురకలు విలేఖరి,తిమ్మాపూర్ సెప్టెంబర్ 07 :** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం తిమ్మాపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శాసనసభాపక్ష నేత కేసీఆర్, ఆ పార్టీ ఎమ్మెల్సీ తాతా మధు దిష్టిబొమ్మలను దహనం చేశారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్ మాట్లాడుతూ రాజ్యాంగపరమైన స్పీకర్ పదవిలో ఉన్న గడ్డం ప్రసాద్ కుమార్ పరుషపదజాలంతో ధూషించడం ఆక్షేపణీయన్నారు. స్పీకర్‌కు భేషరతుగా ఎమ్మెల్సీ మధు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.దళితులంటేనే గిట్టని కేసీఆర్, మధు లాంటి వారి అహంకారాన్ని తగ్గించాలంటే శిక్ష తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దావు సంపత్ రెడ్డి, నుస్తులాపూర్, పోరండ్ల ప్యాక్స్ చైర్మన్లు మోరపల్లి రమణారెడ్డి,గోపు మల్లారెడ్డి,పార్టీ నాయకులు గంకిడి లక్ష్మారెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాసరావు,శ్రీగిరి రంగారావు,కుంట రాజేందర్ రెడ్డి,కంది అశోక్ రెడ్డి,బుదారపు శ్రీనివాస్,కొండలరావు,కొత్త తిరుపతిరెడ్డి,పోలు రాము,రమేష్, తమ్మనవేణి రమేశ్,కంది లక్ష్మి నారాయణ రెడ్డి,పొన్నాల సంపత్,రెడ్డిగాని రాజు, మంచాల అంజయ్య,సంపత్ రెడ్డి,శ్రీనివాస్,పోతుగంటి శ్రీనివాస్,రజాక్ వివిధ గ్రామాల సర్పంచులు,పార్టీ అధ్యక్షులు,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## బైక్ దొంగ అరెస్ట్.. వాహనం స్వాధీనం



**చురకలు విలేకరి,జగిత్యాల,సెప్టెంబర్ 7 :** జగిత్యాల పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన కడమండ కమలాకర్ ఇంటి ముందు పార్క్ చేసిన టీఎస్ 21ఈ 8607 ద్విచక్ర వాహనం ఆగస్టు 17న చోరీకి గురైనట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె.కుమారస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సోమవారం విద్యానగర్ బైపాస్‌లో అదే వాహనంపై వెళ్తున్న వ్యక్తిని పట్టుకుని విచారించగా రాయికల్ మండలం వీరాపూర్‌కు చెందిన షేక్ జమీల్ (30)గా గుర్తించారు.వాహనాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ పి.కరుణాకర్ తెలిపారు.

# పురాతన ఆలయాల సంరక్షణకు కట్టుబడి ఉన్నాం

**-గోదావరి పుష్కరాలను అద్భుతంగా నిర్వహిస్తాం**
**-ధర్మపురి నియోజకవర్గంలో రూ. 200 కోట్లతో పుష్కరాలకు అభివృద్ధి పనులు**
**-ఉగ్ర నరసింహస్వామి పునర్ నిర్మాణంలో పాల్గొనడం అదృష్టం**
**-ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**



**చురకలు విలేకరి, ధర్మపురి, సెప్టెంబర్ 7 :** రాష్ట్రంలోని పురాతన ఆలయాల సంరక్షణకు రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురిలోని శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో ఉగ్ర నరసింహస్వామి పునర్ నిర్మాణ పనులకు సోమవారం తెల్లవారు జామున రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దేవాదాయశాఖ కమిషనర్ హనుమంత రావులతో కలిసి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు మంత్రులకు పూర్ణ కుంభ స్వాగతం పలికారు. ముందుగా ఉగ్ర నరసింహ స్వామి ఆలయంలో ఉపముఖ్యమంత్రితో పాటు మంత్రి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శాస్త్రోక్తంగా నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ 9ఏళ్ల బీఆర్ఎస్ పాలనకు చరమగీతం పాడిన తెలంగాణ ప్రజలు రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నారని అన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రభుత్వంలో ప్రజల ఆలోచనలకు అనుగుణంగా పరిపాలన సాగిస్తున్నామని అన్నారు. 2027లో నిర్వహించే గోదావరి పుష్కరాలను రాష్ట్ర ప్రభుత్వం అద్భుతంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ఇందులో భాగంగా బాసర నుండి భద్రాచలం వరకు ఉన్న ప్రముఖ ఆలయాలను అభివృద్ధి చేయడంతో పాటు పుష్కరాలకు వచ్చే భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పుష్కరాల పనులు నిర్వహించడానికి బడ్జెట్లో వెయ్యి కోట్లు కేటాయించినట్లుఉపముఖ్యమంత్రి తెలిపారు. ధర్మపురి నియోజకవర్గంలోని ధర్మపురి,కోటిలింగాల క్షేత్రాల అభివృద్ధికి రూ. 200కోట్లు కేటాయించినట్లు భట్టి తెలిపారు. వందల ఏళ్ల చరిత్ర కలిగిన ధర్మపురి ఉగ్ర నరసింహ స్వామి పునర్ నిర్మాణ పనుల ప్రారంభానికి రావడం అదృష్టంగా ఉందని ఉపముఖ్యమంత్రి అన్నారు. ఈకార్యక్రమంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నట్లు భట్టి విక్రమార్క అన్నారు. వచ్చే పుష్కరాల నాటికి ఆలయ అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని భట్టి వివరించారు.

**అభివృద్ధి పనులకు శంకుస్థాపన..**

ధర్మపురిలోని ఉగ్ర నరసింహ స్వామి ఆలయ పునర్ నిర్మాణ పనులకు ప్రభుత్వం రూ. 10కోట్ల కేటాయించగా పనుల ప్రారంభానికి ఉపముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ధర్మపురి మండలం తిమ్మాపూర్ గ్రామంలో నూతనంగా రూ. 2.48కోట్లతో ఏర్పాటు చేస్తున్న నూతన సబ్ స్టేషన్ పనులకు శంకుస్థాపన చేశారు. 2027 గోదావరి పుష్కరాలకు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ధర్మపురి వద్ద గోదావరిలో పుష్కర ఘాట్ల నిర్మాణానికి రూ. 22.16 కోట్లతో చేపట్టిన పనులకు శంకుస్థాపన చేశారు. ధర్మపురి,కోటి లింగాలలో రూ. 58.55కోట్లతో తొమ్మిది రోడ్ల నిర్మాణ పనులకు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు.

**ధర్మపురికి రూ. 80కోట్లు మంజూరు...**

జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గంలో పర్యటించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ధర్మపురి నియోజకవర్గంలో నిర్వహించే గోదావరి పుష్కరాలకు మరో 80 కోట్ల రూపాయలు కేటాయిస్తున్నారు ప్రకటించారు. గోదావరి పుష్కరాలకు ఇప్పటికే ధర్మపురి నియోజకవర్గానికి 117కోట్లు విడుదల గాక ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క రూ. 80కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించడంతో ధర్మపురి నియోజకవర్గానికి గోదావరి పుష్కరాల నిధులు సుమారుగా 200 కోట్లకు చేరింది.

**లక్ష్మీ నరసింహ స్వామి దయతో ముందుకు.....**

**రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్....**

ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దయతో ముందుకు సాగుతున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురి ప్రజల ఆశీస్సులతో విజయం సాధించి నియోజకవర్గాన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నానని మంత్రి తెలిపారు.



## బాధితుల సమస్యలకు
# తక్షణ పరిష్కారానికి చర్యలు



**-జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 7 :** బాధితుల సమస్యలకు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసు కుంటూన్నామని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. ప్రతి సోమ వారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 16 మంది ఆర్జీదారులతో నేరుగా మాట్లాడి తమ సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకొవాలని, పోలీస్ స్టేషన్ కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి చట్టపరంగా బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని, ఫిర్యాదుదారునికి భరోసా, నమ్మకం కలిగించాలన్నారు. బాధితుల యొక్క ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్ లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.

## హామీల అమలులో
# ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది



**చురకలు విలేకరి, ధర్మపురి, సెప్టెంబర్ 7 :** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 1000 రోజులు అయినా ప్రజల కు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని బిఆర్ఎస్ నేతలు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వేయి రోజుల పాలన పూర్తి అయిన 100 రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని నిరసిస్తూ ప్రజావాణి సందర్భంగా స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో వెంటనే 6 గ్యారంటీలు 420 హామీలు అమలు చేయాలని మండల అభివృద్ధి అధికారికి, మున్సిపల్ కమీషనర్ వినతి పత్రం అందజేశారు. అనంతరం అసెంబ్లీ వద్ద బిఆర్ఎస్ ఎమ్మెల్యేల అక్రమ అరెస్ట్ మరియు మహిళ ఎమ్మెల్యేల పై దురుసుగా ప్రవర్తించినందుకు నిరసనగా బిఆర్ఎ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. మాజీ డీసిఎంఎస్ చైర్మెన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ వద్ద మహిళా ఎమ్మెల్యేల పట్ల దురుసుగా ప్రవర్తించిన తీరు బాగాలేదు అని మా బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు 8గంటలకే అసెంబ్లీ లో చర్చకు సిద్ధం అవుతే మా పార్టీ నాయకులకు భయపడి అరెస్ట్ లు చేసారని అని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ అయ్యోరి రాజేష్ కుమార్, పట్టణ కన్వీనర్ బండారి రంజిత్, నాయకులు సంగి శేఖర్, చిలువేరి శ్యామ్ సుందర్, పెరుమాండ్ల ఎల్లగౌడ్, చిర్నెని నర్సయ్య, బండారి అశోక్, చుక్క రవి, తరాల కార్తీక్, అనంతుల లక్ష్మణ్, ఎస్టీ ఆసిఫ్, బాకీ శేఖర్, జెట్టి రాజన్న, ఎండీ షమిమా, అక్కనపెల్లి సురేందర్, కుక్కల గంగారెడ్డి, ప్రభాకర్ రావు, కాశెట్టి విజయ్, కనుకుల స్వామి, బుక శ్రీనివాస్, చీపిరిశెట్టి రాజన్న, కాళ్ళ జగన్, దుర్గం రవీందర్, సుమన్, కల్లెం రాజిరెడ్డి, మోలుగురి ప్రశాంత్, మూట పెల్లి లడ్డు, షేకెల్లి సాయి, నూనె సాయి, ఎండీ అర్బాజ్, మూటపెల్లి రాహుల్, సాక సాయి కమల్ తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో హుజూరాబాద్ సబ్ జైలర్

**-రూ.10 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన జైలర్ నాంపల్లి దేవేందర్**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ సెప్టెంబర్ 7 :** హుజురాబాద్ లో సబ్ జైలర్ సోమవారం బాధితుడి నుండి డబ్బులు తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడడం సంచలనం రేపింది. స్థానిక సబ్ జైలర్ నాంపల్లి దేవేందర్ ఓ బాధితుడి నుండి రూ. 10000 లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఏసీబీ డిఎస్పి గట్ల మహేందర్ రెడ్డి.. జైలర్ దేవేందర్ ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. కాక హుజురాబాద్ లో ప్రభుత్వ శాఖల్లో అవినీతి పెరిగిపోయిందని పలువురు ఆరోపిస్తున్నారు. గతంలోనూ పలువురు అధికారులు సిబ్బంది ఏసీబీకి పట్టుబడ్డారు. అయినప్పటికీ అధికారులు సిబ్బంది తీరు మారడం లేదు. ఇటీవల సైదాపూర్ లో ఒక కార్యదర్శి ఎసిబికి పట్టుబడ్డాడు. గతంలో హుజురాబాద్ డిపో మేనేజర్ కూడా ఏసీబీకి పట్టుబడ్డాడు. మరికొంతమంది అవినీతి పేరొందిన అధికారుల భరతం పట్టాల్సి ఉంది. కొన్ని ప్రభుత్వ శాఖల్లో డబ్బులు ఇవ్వనిదే ఫైలు కదలడం లేదు. హుజురాబాద్ ఎస్టీవో కార్యాలయంలో ఓ ఉద్యోగి పేరు ముందు ఏసీబీ నీ చేర్చి పలుకుతున్నారు. అతను డబ్బులు ఇవ్వనిదే ఏ పనిని చేయడం లేదని, బిల్లులను పాస్ చేయాలంటే అతనికి సమర్పించుకోవాల్సిందేనని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమకు బిల్లులు రావడమే ఆలస్యంగా వస్తున్నాయని అలాంటివి డబ్బులు ఏ విధంగా ఇస్తామని బాధితులు, వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. తనకు ఏసీబీ అంటే లెక్క లేదని, తనపై గతంలోనూ ఏసీబీ కేసులు నమోదు చేసిందని, ఆ కేసులు కోర్టులో వీగిపోయాయని తనను ఎవరు ఏమీ చేయలేరని బహిరంగంగా పేర్కొంటున్నాడు. హుజురాబాద్ సబ్ జైల్లోనూ మిలాఖత్ పేరిట డబ్బులు వసూలు చేస్తున్నారు. అలాగే జైలు ఖర్చుల్లోనూ కమిషన్లు దండుకుంటున్నట్టు తెలుస్తోంది. ఏదిఏమైనా ఏసీబీ హుజురాబాద్ పై ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది.